# కహానీ కిచెన్ కీ

**-అబ్బరాజు జయలక్ష్మి**

"రాధా...రాధా... మైడియర్ రాధా.. ఎక్కడున్నావు? ఏం తెచ్చానో చూడు" అంటూ శ్యామ్ ఇంట్లో అడుగుపెడుతూనే ఉత్సాహంగా భార్యామణి కోసం కేకలు పెట్టాడు.

"ఏం తెచ్చారు నా కోసం" అంటూ రాధ ఆత్రుతగా ఎదురొచ్చింది.

"ఇవిగో... ఫ్రెష్‌గా ఎంత బాగున్నాయో చూడు" అంటూ ప్లాస్టిక్ కవర్లో నుండి రాధ దోసిట్లోకి కుమ్మరించాడు.

అప్రయత్నంగా దోసిలి పట్టిన రాధకు వాటిని చూడగానే నోరంతా చేదుగా అనిపించింది. చిట్టి చిట్టి ఆకాకరకాయలు దోసిలి నిండుగా ఉండి ముళ్లు గుచ్చుకుంటున్నట్లుగా ఉంది.

"ఉల్లికారం పెట్టి కాయపళంగా వేయిస్తే ఆహా...ఏం రుచిలే" అంటూ రాధ ముఖ కవళికలు గమనించకుండా డ్రెస్ మార్చుకోవడానికి గదిలోకి వెళ్లాడు. తేరుకున్న రాధ కాకరకాయలను తీసుకెళ్లి చెత్తబుట్టలో పడేసినంత విసురుగా కూరల బుట్టలో పడేసింది.

'ఎవరైనా మగవాళ్లు ఆఫీసు నుండి ఇంటికి వస్తూ ప్రేమగా ఏ స్వీట్సో, మూరెడు పూలో పట్టుకొస్తారుగానీ ఇదేం చోద్యమో అర్థంకాదు. దారిలో కనిపించే కూరగాయల మార్కెట్లో ఆగి తనకు తోచినది, నచ్చినవి రోజుకోరకం కూరలు తీసుకురావడం, వాటిని ఎలా వండాలో తనకు చెప్పడంతోపాటు చేయడం కూడా తనే చేస్తాడు. పెళ్లయి ఆరునెలలయింది కానీ ఈ మనిషిని అర్థం చేసుకోవడం మాత్రం తనవల్ల కావడం లేదు.

తనను అమితంగా ప్రేమిస్తాడు. ఏ లోటు రానివ్వకుండా చూసుకుంటాడు. కానీ ఇదిగో ఈ వంట గోల మాత్రం తను భరించలేకపోతోంది. ఏ టాపిక్ మొదలుపెట్టినా అటు తిప్పి ఇటు తిప్పి వంటల మీదకే మళ్లుతుంది. గుత్తివంకాయ కూర ఎన్ని రకాలు చేయవచ్చు?

ఏ కూరకు పోపు ఎలా వేయాలి? ఆనపకాయతో ఏ ఏ వంటలు వండుతారు? ఆవపెట్టి వండాల్సిన కూరలు ఏవి? అంటుపులుసు, బెల్లంతో చేయాల్సిన కూరలు ఏవి? అప్పడాలు నూనెలో వేయించాలా? నిప్పులపై కాల్చాలా? ఇలా వెరైటీగా వంట చేయడంలో తనకున్న నైపుణ్యాన్నంతా రాధ దగ్గర ప్రదర్శిస్తూ ఉంటాడు శ్యామ్.

ఒకరోజు స్నేహితురాలు ఉష వచ్చినప్పుడు ఇదంతా ఆమెతో చెప్పుకుంది రాధ.

అంతా విన్న ఉష "చక్కగా వంట చేసి పెట్టే భర్త దొరికినందుకు సంతోషించక అంత బాధ పడతావెందుకు రాధా? మా ఆయన అయితే వంటగదిలోకి అడుగు కూడా పెట్టడు. ఎంతయినా నువ్వు అదృష్టవంతురాలివే" అన్నది.

"నువ్వెన్నయినా చెప్పు. ఎంత నాకు వంట రాకపోతే మాత్రం రోజూ ఇలా కిచెన్‌లోనే కాలం వెళ్ళబుచ్చాలా? ఓ అచ్చటా లేదు, ముచ్చటా లేదు" అని నిట్టూర్చింది రాధ.

★★★

ఆదివారం వస్తోందటే రెండురోజుల ముందు నుండే ఆ రోజు ఉదయం ఏం టిఫిన్ చేయాలి? మధ్యాహ్నం భోజనంలోకి స్పెషల్ డిషెస్ ఏమిటి? సాయంత్రం స్నాక్స్‌గా పకోడీలా? బజ్జీలా? ఇలా ఆలోచిస్తూ మెనూ తయారు చేసేస్తాడు శ్యామ్ ముందుగానే.

కానీ రాధ మాత్రం ఆదివారంనాడైనా వంటకు గుడ్‌బై చెప్పేసి ఎంచక్కా తామిద్దరు చెట్టాపట్టాలేసుకుని సినిమాలకు, హోటళ్లకు వెళితే బాగుంటుందని అనుకుంటుంది. శ్యామ్ అలాంటివాటి గురించి ఆలోచించడు. చెప్పినా వినిపించుకోడు.

ఆడ పుట్టుక పుట్టి తనకు వంట చేయడం రానందుకు బాధగానూ, మగమహారాజు అయ్యుండి శ్యామ్ ఓపిగ్గా వంటలన్నీ చక్కగా, రుచిగా చేస్తున్నందుకు ఆశ్చర్యంగానూ, కొంచెం అసూయగానూ కూడా వుంటుంది ఒక్కొక్కసారి రాధకు. నిజంగానే రాధకు వంటలో ఓనమాలు కూడా రావు.

ఇంట్లో బామ్మ, అమ్మ, వదిన... అందరూ ఉండడంవల్ల తనకు వంట గదిలో అడుగు పెట్టాల్సిన అవసరం కూడా ఉండేదికాదు. అయినా వంట చేయడం రాకపోతే పెళ్లయ్యాక ఎంత ఇబ్బంది పడాలో నేర్పలేదని మాకూ మాటొస్తుంది అంటున్న తల్లి మాటలను పట్టించుకునేది కాదు రాధ.

'అదొక బ్రహ్మవిద్యా ఏమిటి? అప్పుడెలాగూ ఆ తిప్పలు తప్పవు. ఇప్పటి నుండి ఎందుకు ఆ వంటింటి కష్టాలు' అంటూ ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ ఉండేది. ఇప్పుడదే చాలా కష్టమైన పనిగా అనిపిస్తోంది.

శ్యామ్ భోజన ప్రియుడు. ఉద్యోగంలో చేరాక ఒంటరిగా ఉండవలసి రావడంతో బయట తిండి తినలేక స్వయంపాకానికి అలవాటుపడ్డాడు.

వంటల్లో ఆరితేరాడు. ఆ పాకశాస్త్ర ప్రావీణ్యా


న్నంతా ఇప్పుడు భార్య దగ్గర ప్రదర్శిస్తున్నాడు.

★★★

ఒక ఆదివారంనాడు శ్యామ్ కొలీగ్ ఒకతను ఇంటికి వచ్చాడు. వంట గదిలో నుండి మోకాళ్ల పైకి మడిచి కట్టిన లుంగీ, పైన బనీను, చేతిలో గరిటతో శ్యామ్ బయటకు వచ్చాడు.

అతని అవతారం చూసి వచ్చినతను 'రాకూడదని సమయంలో వచ్చానా?' అని తెగ ఇబ్బంది పడిపోయి ఎక్కువసేపు ఉండ కుండా త్వరగా వెళ్లిపోయాడు. కానీ శ్యామ్‌కు మాత్రం ఏమీ చిన్నతనంగా అనిపించలేదు సరికదా తాను పెట్టబోతున్న సాంబారు గురించి చెప్పి ఎలా చేస్తే బావుంటుందో, అసలు రసానికి, సాంబారుకు తేడా ఏమిటో ఇలాంటివన్నీ చెప్పి ఉన్న కాసే పట్లో అతని బుర్ర తినేసాడు.

అతను వెళ్లగానే రాధ "మీ ఫ్రెండు రేపు ఆఫీసులో అందరికీ మీరు వంట చేస్తారని చెప్పేస్తా డేమో? అందరూ ఏమనుకుంటారో?'' అన్నది.



అందుకు శ్యామ్ పెద్దగా నవ్వేసాడు.

"చెప్పనీ రాధా! ఇందులో సిగ్గు పడాల్సింది మీలేదు. కమ్మగా తినాలంటే వంట బాగా చేయాలి. భార్యాభర్తల్లో ఎవరికి వంట చేయడం బాగా వస్తే వాళ్లు చేస్తారు. అసలు మగవాళ్లు వంట చేయడం తప్పన్నట్లు మాట్లాడతారు ఎందుకో నాకర్థంకాదు. నల భీములు మగవారే కదా. పాకశాస్త్ర ప్రవీణులని వారికి పేరు లేదా! పెద్ద పెద్ద హోటళ్లల్లో చెఫ్‌లందరూ పురుషులే కదా. ఇంకా చెప్పాలంటే ఈ రోజుల్లో భర్తలు చాలామంది భార్యలకు ఇంటి పనుల్లోనూ, వంట పనుల్లోనూ సహకరిస్తున్నారు. ఆ... మర్చిపో యాను. సాంబారులో పోపులు ఎలా వేయాలో చూద్దువుగానీ రా'' అంటూ వంటగదిలోకి పరుగెత్తాడు. అనుసరించక తప్పలేదు రాధకు.

★★★

"నీకు ఒక సలహా చెప్పి వెళ్దామని వచ్చాను రాధా" అన్నది ఉష ఒక రోజు వస్తూనే.

"ఏ విషయంలో?" అన్నది నిర్లిప్తంగా రాధ.

"అదే మీ ఆయన వంటా వార్పూ విషయంలో"

"ఏమిటో చెప్పి పుణ్యం కట్టుకోవే" అన్నది రాధ.

"అందుకే ఒక్కటే మార్గం వుంది. ఆయన చేసిన వంటలు ఏవీ బాగాలేవని పదే పదే చెబుతూ ఉండు. మీ ఆయన ఏం వంటలు చేసినా బాగాలేదని వంకలు పెట్టు"

"ఆయన వంట బాగా చేస్తారు. అబద్ధాలు చెప్పడమెలాగే?"


"కాస్త ఉప్పో కారమో అతడు చూడకుండా కూరల్లో కలుపుతూ ఉండడమే" అన్నది ఉష కొంచెం గొంతు తగ్గించి.

"అలా అయితే తినడమెలాగే! అలా చేయడం తప్పుకదా" అంటూ సందేహిస్తున్న రాధను మరి మాట్లాడనివ్వలేదు ఉష.



## మనీషా పెళ్లి!

'సౌదాగర్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన నేపాలీ భామ మనీషా కొయిరాలా పెళ్లికూతురవుతోందిప్పుడు. నలభైల్లోకి అడుగుపెడుతున్న మనీషా- నేపాల్‌కే చెందిన సామ్రాట్ అనే బిజినెస్‌వాలాను వివాహమాడుతోందిట. జూన్ 19న మనీషా-సామ్రాట్‌ల పెళ్లి ఖాట్మండులో జరుగుతుందని, పెళ్లి తర్వాత కూడా మనీషా సినిమాల్లో కంటిన్యూ అయ్యే అవకాశాలున్నాయని ఆమె సన్నిహితుల చెబుతున్నారు.




"తప్పదు మరి. నేను చెప్పినట్లు కొన్నాళ్లు చేసి చూడు. ఆ తరువాత నీకే తెలుస్తుంది. మీ ఆయన వంట జోలికి వస్తే ఒట్టు" అటూ గట్టిగా చెప్పి వెళ్లింది.

రాధ ఆలోచనలో పడింది.

***

కొన్ని నెలల తరువాత-

రాధ రుచికరంగా వండి కొసరి కొసరి వడ్డిస్తుంటే తృప్తిగా భోజనం చేస్తున్నాడు శ్యామ్.

ఇప్పుడు ఆదివారాలే కాదు రోజూ సాయంకాలాలూ షికార్లకు వెళ్తున్నారు.

ఈ మార్పుకు కారణం స్నేహితురాలు ఇచ్చిన సలహాను పాటించడం వల్ల మాత్రం కాదు.

వంట బాగాలేదని అబద్ధం చెప్పడంగానీ, అతన్ని మోసం చేయడం కానీ నచ్చలేదు రాధకు.

అందుకే స్నేహితురాలి సలహా విని ఊరుకున్నది కానీ దానిని పాటించలేదు.

ఈ వంట ఇంటి భాగోతం అంతా ఫోన్‌లో తల్లితో మొరబెట్టుకుంది రాధ.

"నేను అర్జంటుగా వంట నేర్చుకోవాలి. ఆయన్ను వదిలిపెట్టి నేను రావడం కుదరదుగానీ నువ్వు వెంటనే బయలుదేరి రావాలి" అని ఖచ్చితంగా చెప్పింది. దాని ఫలితంగా బామ్మగారు ఆఘమేఘాలమీద వచ్చి మనవరాలి దగ్గర వాలింది.

"పెళ్లికి ముందే వంట చేయడం నేర్చుకోమ్మా అంటే విన్నావుకాదు. 'అదొక బ్రహ్మ విద్యనా' అన్నావు.ఇప్పుడు చూడు ఎన్ని కష్టాలు పడుతున్నావో! అబ్బాయేమో వంట వచ్చినవాడు, పైగా కాస్త భోజనప్రియుడు. కమ్మగా పెళ్లాం వండిపెడితే తినాలనుకోడం తప్పుకాదుకదా. నీకు వంట చేయడం ఇష్టంలేదు. నేర్చుకోవాలనే శ్రద్ధలేదు. అందుకే నీకు రావడంలేదు. మనసు పెట్టి చేస్తే ఏ వంటయినా చక్కగా కుదురుతుంది. ఈ కాలపు ఆడపిల్లలు ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగాలు చేస్తూ భర్తకు వేన్నీళ్లకు చన్నీళ్లు అన్నట్లు ఉంటున్నారు.

బాగానే వుందిగానీ కమ్మగా వంట చేయడం అనే దానిపై ఎవరూ ఆసక్తి చూపించడంలేదు. ఫాస్ట్‌ఫుడ్‌కి అలవాటు పడుతూ హోటల్ తిండి తింటూ ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేస్తున్నారు. పెళ్లికి ముందే చదువుతోపాటు ఇంటి పనులన్నీ కూడా నేర్చుకుని వుంటే తరువాత ఎటువంటి పాట్లు పడవలసిన అవసరం ఉండదు కదా. అప్పుడు అమ్మాయిలు రెండువైపులా పదునున్న కత్తుల్లా అవసరమైతే ఉద్యోగంతోపాటు ఇంటి బాధ్యతలు కూడా సులువుగా చూసుకోగలుగుతారు" అంటూ తన ధోరణిలో హితబోధ చేసి వంట నేర్పడంతోపాటు వంట ఇంటి చిట్కాలు కొన్ని మెళకువలు అన్నీ రాధకు వంట పట్టేలా చేసి మరీ వెళ్లింది.

అలా బామ్మ దగ్గర శ్రద్ధగా అన్నీ నేర్చుకున్న రాధకు ఇప్పుడు వంట చేయడం అంటే చిటికెలో పని.

శ్యామ్‌కు నచ్చిన విధంగా వండి ప్రేమగా వడ్డించడం అంటే చాలా చాలా ఇష్టం.

వంట చేయడానికి అలవాటు పడ్డ శ్యామ్ మాత్రం అప్పుడప్పుడూ రాధకు సహాయం చేసే నెపంతో చేతులు కాల్చుకుంటూనే ఉన్నాడు.

★